


వాసవీ అమ్మవారి గ్రామోత్సవం

రెంటచింతల: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఇది 137.8642 టీఎంసీలకు సమానం.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

మంగళగిరి: మండలంలోని రామచంద్రాపురంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ సేవలు అభినందనీయం

ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్



బాపట్ల: రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి బాపట్లలో చేపడుతున్న సేవలను ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లాను అగ్రగామిగా నిలిపినందుకు బాపట్ల జిల్లా కలెక్టర్ కలెక్టర్ జె వెంకట మురళికి అవార్డు, పతకాన్ని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. గురువారం ఏపీ రాజభవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ వెంకట మురళి అవార్డు అందుకున్నారు. గడిచిన ఏడాది కాలంలో బాపట్ల జిల్లాలో 1,200 మందిని రెడ్‌క్రాస్ సభ్యులుగా చేర్పించారు. జిల్లాకు రూ.12 లక్షలు సొమ్మును సభ్యత్వ నమోదుతో రెడ్‌క్రాస్ సంస్థకు ఆర్థిక వనరులను పెంచారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు.ఇటీవల కృష్ణానది వరద విపత్తు సమయంలోనూ బాపట్ల జిల్లాలో ఎలాంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు ప్రణాళికతో జాగ్రత్త చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. ఆ సమయంలో ప్రజలకు విశేషంగా సేవలందించినందుకు జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ భట్టు తదితరులు పాల్గొన్నారు.

పాక్ ఉగ్రవాదాన్ని మట్టుబెట్టే సత్తా భారత్‌కు ఉంది



కారంచేడు: పాకిస్తాన్‌ని పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని మట్టు పెట్టగలిగే సత్తా భారత్‌కు ఉందని బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. గురువారం కారంచేడు గ్రామంలోని ఆమె స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయక ప్రజలపై చేసిన దాడులను భారత్ సైన్యం దీటుగా తిప్పికొట్టిందన్నారు. ప్రపంచదేశాలన్నీ ఇప్పుడు పాకిస్తాన్‌ను ఒంటరిని చేశాయన్నారు.


తీరంలో ఇద్దరు యువతులు గల్లంతు

కాపాడిన పోలీసులు



బాపట్లటౌన్: స్నానాలు చేస్తూ ఇద్దరు యువతులు సముద్రంలో మునిగిపోయిన ఘటన గురువారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దుర్గేశ్‌దేవి, నీషాలు గుంటూరు జిల్లా ఏటుకూరు రోడ్ బైపాస్, హనుమాన్ టెంపుల్ సమీపంలోని బుల్లెట్ స్పిన్నింగ్ మిల్లులో నివాసముంటున్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సూర్యలంక బీచ్‌కి వచ్చారు. స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి సముద్రంలో ఇద్దరు యువతులు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై ఇరువురిని కాపాడారు. ఇద్దరు ప్రాణాలు కాపాడిన కోస్టల్ సెక్యూరిటీ సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ నాగశివారెడ్డి, ఏఎస్ఐ అమరేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్‌రావు, హోంగార్డు నారాయణలను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

తహసీల్దారు కార్యాలయం మూత



అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు తహసీల్దార్ కార్యాలయం గురువారం మూత పడింది. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పీఏ వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు రెవెన్యూ సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేశారు. వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఇది ప్రజా స్వామ్యమా? నియంతృత్వమా?



మీడియా ఎడిటర్ ఇంటిపై దాడి దేశంలోనే ఇది ప్రప్రథమం. ప్రజలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే అడిగే హక్కు ఎవరికీ లేదా? ఇది ప్రజా స్వామ్యమా? నియంతృత్వమా? పది నెలల్లోనే రాజ్యాంగాన్ని తిరగరాసి రెడ్‌బుక్ అమలు చేస్తానంటే చూస్తూ ఊరుకోవాలా? ఇది సాక్షి ఎడిటర్ ఇంటిపై మాత్రమే జరిగిన దాడి కాదు.. ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి.

– బి.వి.రాఘవరెడ్డి, ఏపీ నెట్‌వర్క్ ఇన్‌చార్జి, సాక్షి దినపత్రిక

సాక్షికి పోరాటాలు కొత్త కాదు



సాక్షికి పోరాటాలు కొత్త కాదు. ఎడిటర్ ఇంటిపై దాడిచేయడం తగదు. నచ్చని విషయాలు రాస్తే అణచివేయాలని చూస్తారా? రెండు నెలల క్రితం పుట్టిన సంస్థకు రూ.కోట్ల విలువైన భూముల ఇచ్చేసి, ఆ విషయాన్ని రాయొద్దంటే ఎలా? తప్పు చేస్తే ప్రెస్ కౌన్సిల్, న్యాయస్థానాలకు ఫిర్యాదు చేయాలి. ఇంటికి పోలీసులను పంపడం తగదు. ఎంత అణచివేయాలని చూస్తే. సాక్షి అంతగా పైకి లేస్తుంది.

– పి.శ్రీనివాస్, అసోసియేట్ ఎడిటర్, సాక్షి దినపత్రిక

పోలీసుల చొరబాటు హేయం



'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిలోకి పోలీసుల చొరబాటు హేయమైన చర్య. అకారణంగా ఇంట్లోకి పోలీసులు చొరబడటం సబబు కాదు. గౌరవ ప్రదమైన వ్యక్తుల ఇళ్లకు వెళ్లేటప్పుడు సెర్చ్ వారెంటు తీసుకోవాలి. మరోసారి ఇలాంటివి జరక్కుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– చిలుకా చంద్రశేఖర్, ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , సత్తెనపల్లి

జులుంపై నిరసన గళం

సాక్షి దినపత్రికపై ఖాకీ పడగ

అక్షరంపై అక్కసు వెళ్లగక్కుతున్న కూటమి సర్కార్‌పై పాత్రికేయలోకం మండిపడింది. పోలీసులను అడ్డు పెట్టుకుని పచ్చ సైన్యం దాడిపై కన్నెర్ర జేసింది. అక్రమ కేసులు పెడుతూ, ఖాకీలతో దాష్టికానికి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పాత్రికేయులు నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభం అయిన ఫోర్త్ ఎస్టేట్‌పై దాడిని ఖండించారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో గురువారం ఉదయం పోలీసుల సోదాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సెర్చ్ వారంట్ లేకుండా అక్రమంగా ఆయన నివాసంలోకి ప్రవేశించి వ్యవహరించిన తీరుపై నిరసన గళం విప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 'సాక్షి'గా కూటమి పాలకుల నిరంకుశ విధానాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు . నిజాల్ని నిర్భయంగా తెలిపే అక్షరానిదే అంతిమ విజయమని నినదించారు

- 'సాక్షి' ఎడిటర్ గృహంలో పోలీసుల అక్రమ సోదాలపై పెల్లుబికిన ఆగ్రహం
- నిరసించిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు
- 'సాక్షి' గొంతు నొక్కేందుకే ఈ చర్య అంటూ ఆందోళన
- కూటమి ప్రభుత్వ నియంత పోకడలపై మండిపాటు



గుంటూరు లాడ్జి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

పట్నంబజారు: గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'సాక్షి' సిబ్బంది, పలు పత్రికల పాత్రికేయులు, సోషల్ మీడియా రిపోర్టర్లు, ప్రతినిధులు, యువత, విద్యార్థులు, జర్నలిస్టు యూనియన్ నేతలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఎండగట్టారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో పోలీసుల సోదాలను ఖండించారు. కూటమి ప్రభుత్వ నియంత పోకడలపై పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ పత్రికల గొంతు అణచివేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒంటెత్తు పోకడలతో ముందుకు సాగుతోందని ధ్వజమెత్తారు. ఫోర్త్ ఎస్టేట్‌గా పిలువబడే మీడియాకు సంకెళ్లు వేసే విధంగా చంద్రబాబు సర్కార్ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నిజాలను నిగ్గుతేలుస్తూ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపుతున్నారనే దుగ్ధతో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. న్యాయవాది మొండితోక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి సమాచారం లేకుండా నివాసాల్లోకి చొరబడి, తనిఖీ చేసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సాక్షి రిపోర్టర్లు పి.ఎస్.ఎన్.వి. ప్రశాంత్, వి.కిరణ్‌కుమార్, ధూపాటి ప్రకాష్, ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎం.సి.హెచ్.కోటిరెడ్డి, ఫొటోగ్రాఫర్ రామ్‌గోపాలరెడ్డి, ఎం.డి.సత్యనారాయణ, జి.వెంకటరెడ్డి, అబ్దుల్లా, పలు పత్రికల రిపోర్టర్లు కార్తిక్‌రెడ్డి, బాషా, వంశీ, ఎస్ఆర్‌కే సుభాని, వినయ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జి.వి.రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న 'సాక్షి' ఎడిషన్ ఇన్‌చార్జి ఎం.తిరుమలరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే నేతలు, జర్నలిస్టులు

గుంటూరు మెడికల్: సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంపై విజయవాడ నగర సెంట్రల్ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ప్రవేశించి సెర్చ్ చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) నేతలు ఖండించారు. ఈ మేరకు గురువారం ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు షేక్ నాగూల్‌మీరా మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను వెలికి తీయడంతోపాటు, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములవుతున్న పత్రికారంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మొత్తం మీడియాపై ఇవే దాడులు, ఇవే ఆంక్షలు, ఇలాంటి బెదిరింపులు కొనసాగే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభం అయిన మీడియా పరిరక్షణకు పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో 'సాక్షి' ఎడిషన్ ఇన్‌చార్జి ఎం.తిరుమలరెడ్డి, యూనియన్ జిల్లా సెక్రటరీ కె.రాంబాబు, నగర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణశర్మ, అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్, సబ్ ఎడిటర్లు దివి రఘు, పి.శ్రీనివాసరావు, ఎస్.వెంకట్, బి.సురేష్‌బాబు, జర్నలిస్టులు మొండితోక శ్రీనివాసరావు, షరీఫ్, వీరయ్య, సురేంద్ర, పి.ప్రశాంత్, డి.ప్రకాష్, ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎం.కోటిరెడ్డి, రామ్‌గోపాలరెడ్డి పాల్గొన్నారు.

దాడులు హేయమైన చర్య

'సాక్షి' దినపత్రిక సంపాదకుడు ఆర్. ధనంజయరెడ్డి ఇంటిలో పోలీసులు తనిఖీలు చేసిన తీరును ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూల్‌మీరా, ప్రధాన కార్యదర్శి కె.రాంబాబులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు సోదాలు చేయాలని భావించి ఉంటే ముందుగా నోటీసు ఇచ్చి ఉండాలని సూచించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు ఇంటిలో చొరబడిన తీరును ఖండించారు. ఇలాంటి ధోరణి భావ్యం కాదని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి

తెనాలి: 'సాక్షి' దినపత్రిక సంపాదకుడు ఆర్.ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల సోదాలపై సాక్షి మీడియా తెనాలి ప్రతినిధులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. వహాబ్ రోడ్డులోని అజీమ్‌ఖాన్ వీధిలోని సాక్షి రీజనల్ సెంటర్ కార్యాలయం నుంచి సాయంత్రం ప్రదర్శనగా మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీ దగ్గర్లోని వెటర్నరీ కాలనీలో 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసం ఉంటున్న అపార్టుమెంటుకు నగర సెంట్రల్ ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్‌లు సిబ్బందితో పాటు అక్రమంగా ప్రవేశించినట్టు తెలిపారు. సెర్చ్ వారంట్, ఎలాంటి నోటీసు లేకుండా వచ్చి భయానక వాతావరణం సృష్టించారని పేర్కొన్నారు. గౌరవప్రదమైన పత్రికా ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్.ధనుంజయరెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించటంతోపాటు సమాజంలో పరువు ప్రతిష్టలకు విఘాతం కలిగే రీతిలో పోలీసులు వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఇది సాక్షి ఎడిటర్‌పై మాత్రమే జరిగిన దాడి కాదనీ, భవిష్యత్‌లో మొత్తం మీడియాపై ఇవే దాడులు, బెదిరింపులు కొనసాగే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాక్షి తెనాలి రీజనల్ సెంటర్ ఇన్‌చార్జి బి.ఎల్.నారాయణ, సాక్షి మీడియా విలేకరులు కేజే నవీన్, ఆలపాటి సుధీర్, తాడిబోయిన రామకృష్ణ, సాక్షి టీవీ ప్రతినిధి తోట శ్రీనివాసరావు, వేమూరు ఆర్‌సీ ఇన్‌చార్జి బుల్లయ్య, సర్క్యులేషన్ ఇన్‌చార్జి దాసు తదితరులు పాల్గొన్నారు. సంఘీభావంగా స్థానిక పత్రిక సంపాదకుడు అడపా సంపత్‌రాయుడు పాల్గొన్నారు.



తెనాలిలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సాక్షి మీడియా జర్నలిస్టులు

ఎడిటర్ ఇంటిపై దాడి హేయమైన చర్య



కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బాపట్ల టౌన్: నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే పత్రికా సంస్థల ఎడిటర్ ఇళ్లపై ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం నోటీసులు జారీ చేయకుండా దాడులు చేయడం హేయమైన చర్యని బాపట్ల వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ సహాయ కార్యదర్శి కాగిత ప్రశాంత్‌రాజు తెలిపారు. సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డి అపార్టుమెంట్‌లోకి పోలీసులు వెళ్లి తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తించిన తీరుకు నిరసనగా గురువారం సాయంత్రం బాపట్లలోని జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి సీతారత్నానికి వినతిపత్రం అందజేశారు. ప్రశాంత్‌రాజు మాట్లాడుతూ కనీసం సెర్చ్ వారెంట్ అడిగినా చూపకుండా దురుసుగా ప్రవర్తించడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుందని తెలిపారు. పత్రికా ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్. ధనుంజయరెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు, సమాజంలో పరువు ప్రతిష్టలకు విఘాతం కలిగే రీతిలో వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలను వెలికితీయడంతోపాటు, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములవుతున్న పత్రికా రంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాపట్ల జర్నలిస్ట్ సంఘాల నాయకులు వేజెండ్ల శ్రీనివాసరావు, మురికిపూడి అంజయ్య, అంగిరేకుల కోటేశ్వరరావు, రాఘవేంద్రరావు, పరిశా వెంకట్, సృజన్ పాల్, శీలం సాగర్, మార్పు ఆనంద్, అడే రవిజేత, జె. రవిరాజేష్ పాల్గొన్నారు.

కలంపై కత్తి కట్టారు

నరసరావుపేట: పత్రికా స్వేచ్ఛకు, ప్రతినిధులకు కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోవటం దురదృష్టకరమని జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, కులసంఘాల నాయకులు పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు చేసిన అక్రమ సోదాలను నిరసిస్తూ గురువారం సాయంత్రం పల్నాడు జిల్లా ప్రెస్ క్లబ్, నరసరావుపేట, ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్(ఏపీడబ్ల్యూజే), ఏపీ యూ ట్యూబ్ న్యూస్ చానల్స్ ఆఫ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

వారెంట్ లేకుండా ఎలా వెళతారు?

పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట అధ్యక్షుడు సీహెచ్‌వీ రమణారెడ్డి, ఏపీడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కేఎస్ కృష్ణ మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభమైన మీడియా రంగంపై ప్రభుత్వాల దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి దినపత్రిక పల్నాడు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆర్.లవకుమార్‌రెడ్డి, సాక్షి టీవీ జిల్లా రిపోర్టర్ అశోక్, నరసరావుపేట ప్రతినిధి సుంకిరెడ్డి, జర్నలిస్టులు జి.సాంబశివారెడ్డి, పి.కోటిరెడ్డి, పాదర్తి ప్రసాదు, యూట్యూబర్ అసోసియేషన్ జిలా అధ్యక్షుడు షేక్ షాహిద్, పీడీఎం రాష్ట్ర నాయకుడు నల్లపాటి రామారావు, పీకేఎస్ నాయకుడు కంభాల ఏడుకొండలు, డీబీహెచ్ నాయకుడు గోదా రమేష్‌కుమార్ పాల్గొన్నారు.




నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద ప్రదర్శన చేస్తున్న జర్నలిస్టులు, ప్రజా, కులసంఘాల నాయకులు

లక్ష్యాలను ఎంపిక చేసుకుని కష్టపడాలి

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి
- ఘనంగా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

బాపట్ల: విద్యార్థులు లక్ష్యాలను ఎంపిక చేసుకుని కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి ఆకాంక్షించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 80వ వార్షికోత్సవం గురువారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంతోమందికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చి సాంకేతిక వ్యవసాయంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఘన చరిత్ర ఆచార్య ఎన్జీ రంగా కళాశాలకు ఉందన్నారు. గొప్ప వ్యవసాయ నిపుణులను మన రాష్ట్రానికి కళాశాల అందించిందన్నారు. హైదరాబాద్ ఇండియన్ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను పెంపొందించాలని పేర్కొన్నారు. కళాశాల డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు, వ్యవసాయ విద్యారంగంలో నూతన అవకాశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసూనరాణి బోధన, పరిశోధన విస్తరణలో గత సంవత్సరం కళాశాల సాధించిన పురోగతి వార్షిక నివేదికను అందజేశారు. గత నెలలో జరిగిన సాహిత్య, క్రీడా సాంస్కృతిక పోటీలలో విజేతలైన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రతిభ కనబరిచిన ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏ.వి.రమణ, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి

పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్

బాపట్ల: జిల్లాలో ఎస్ఎస్‌సీ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను, ఒకేషనల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. 19 సెంటర్లలో నిర్వహించే పరీక్షకు 3202 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు (ఒకేషనల్) ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి(ఒకేషనల్) పరీక్షలను ఏడు సెంటర్లలో నిర్వహిస్తున్నట్లు, ఈ పరీక్షకు 873 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ (ఒకేషనల్) పరీక్షలను మూడు సెంటర్లలో నిర్వహిస్తున్నట్లు, 1184 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నపత్రాలను కేంద్రాలకు పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయడంతోపాటు ఏఎన్ఎంలను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

మొగదారమ్మ తిరునాళ్ల ప్రారంభం



నిజాంపట్నం: నిజాంపట్నంలో వేంచేసియున్న మొగదారమ్మ అమ్మవారి సిడిమాను, తిరునాళ్ల మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. తొలి రోజు అమ్మవారికి పసుపు, కుంకుమ, వేపాకుతో పూతవేసి విశేష పూజలు చేశారు. పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి ప్రదర్శించిన సత్య హరిచంద్ర పౌరాణిక నాటకం ఆకట్టుకుంది.

బస్టాండ్‌లో యువకుడు మృతి



మేదరమెట్ల: గుంటూరుకు చెందిన ఓ యువకుడు కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల బస్టాండ్ ఆవరణలో గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమామహేష్ (27) తన తల్లిదండ్రులతో కలిసి పనిపై అద్దంకి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో మేదరమెట్ల బస్టాండ్‌కు వచ్చాడు. అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది పరీక్షించి చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతుడి తల్లిదండ్రులు బోరున విలపించారు. ఆటోలో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు



జె.పంగులూరు: అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు తప్పనిసరిగా అందిచాలని చీరాల ఆర్డీఓ టి.చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేపై ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులను అందుబాటులో ఉండే విధంగా చూసుకొని రీ సర్వే చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అనుభవంలో ఉన్న రైతుల వద్ద నుంచి వివరాలు సేకరించి నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతుల వద్ద నుంచి నీటి పన్ను వసూలు చేయాలని తెలిపారు. నూటికి నూరు శాతం నీటి పన్ను వసూలయ్యేలా చూసుకోవాలన్నారు. రేషన్ కార్డుల సమస్య పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త కార్డు అందేలా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. సింగారావు, రీ సర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ సురేష్ బాబు, ఆర్ఐ టి.శ్వేత పాల్గొన్నారు.

అవినీతి నిగ్గుతేల్చండి

- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు
- బీసీ మహిళల కుట్టు మిషన్ల పంపిణీ శిక్షణలో అవకతవకలపై ధ్వజం



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు రాఘవ, మేరిబాబు, సుబ్బారావు

చీరాల: రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా చేస్తున్న బీసీ మహిళలకు కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీలో భారీగా అవినీతి జరిగిందని.. ప్రజాధనాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నేతలు ధ్వజమెత్తారు. నియోజకవర్గ అధ్యక్షుడు సాదు రాఘవ, పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, వేటపాలెం అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు గురువారం ఆర్డీవో కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ జి. మహేశ్వరికి వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళల కోసం రూపొందించిన కుట్టు మిషన్ల శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీలో ప్రజాధనం రూ.167 కోట్లను టీడీపీ, కూటమి నేతలు దోచుకుతిన్నారని ఆరోపించారు. ఒక్కో మహిళా లబ్ధిదారురాలికి రూ.20వేలు నిర్ధారించి.. మొత్తం మీద రూ.230 కోట్లు కేటాయించారన్నారు. టెండర్ మొత్తాన్ని ఒకే వ్యక్తికి అప్పనంగా అందజేశారన్నారు. కుట్టు శిక్షణకు ఒక్కోరికి రూ.3వేలు, కుట్టు మిషన్ కొనుగోలుకు రూ.4300 కలిపి రూ.7300 అయిందన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా కుట్టు మిషన్ శిక్షణ, కొనుగోలు ఖర్చు రూ.73 కోట్లు కాగా టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్లిన ప్రజాధనం రూ.167 కోట్లు అని.. దీని వెనకున్న వారిని బయటకు లాగాలని డిమాండ్ చేశారు. కుట్టు మిషన్ల పంపిణీకి 65 కంపెనీలు పాల్గొనగా శ్రీ టెక్నాలజీకి దొరికిందని.. అయితే తనకు సంబంధించిన టెండర్ టీడీపీ నేతలు బెదిరించి లాక్కున్నారని కాంట్రాక్టర్ బహిరంగంగానే చెప్పడం టీడీపీ నేతల బరితెగింపులకు నిదర్శనమన్నారు. యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కె.ప్రసాద్‌రెడ్డి, పట్టణ పార్టీ కార్యదర్శి చిరంజీవి, వేటపాలెం బీసీ సెల్ అధ్యక్షుడు ఉమా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

పొగాకు రైతులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

అంజనీప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి అంజనీప్రసాద్‌రెడ్డి

బాపట్ల: పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం నట్టేటా ముంచేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి అంజనీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంజనీప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. జిల్లా పరిధిలో అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో పొగాకు, మిర్చిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పర్చూరు నియోజకవర్గంలోని వీరన్నపాలెంలో పొగాకు రైతు ఆత్మహత్య కూటమి పాలనకు నిదర్శనంగా చెప్పుకోవచ్చన్నారు. అధికారం వస్తే అవి చేస్తాం..ఇవి చేస్తామని చెప్పి రైతులను పట్టించుకోవటంలేదన్నారు. అన్నదాత సుఖీభవ సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామనే హామీ నెరవేర్చుకోలేకపోతున్నారన్నారు. రైతుల ఆత్మహత్యపై కూటమి ప్రభుత్వం సరైన సమాధానం చెప్పాలని నిలదీశారు. రైతు కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఐదు సంవత్సరాల పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రైతులు అడిగిందే తడవుగా సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా రామయ్య, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, తన్నీరు అంకమ్మరావు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గాదె వీరారెడ్డి మెమోరియల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం పోటాపోటీగా జరిగాయి. పావులూరు రెడ్డి యూత్ నిర్ణీత 10 ఓవర్లలో 83 పరుగులు చేయగా బీసీ యూత్ ఐదు ఓవర్లలో 84 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించారు. రెండో మ్యాచ్ పావులూరు వెంకటేష్ ఫ్రెండ్స్, దగ్గుబాడు ఫ్రెండ్స్ యూత్ జట్ల మధ్య నిర్వహించగా పావులూరు వెంకటేష్ ఫ్రెండ్స్ జట్టు విజయం సాధించింది. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, కార్యదర్శి పులఖండం రామకృష్ణా రెడ్డి, తలకాయల కోటి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



పావులూరులో హోరాహోరీగా జరుగుతున్న క్రికెట్ పోటీలు

గాజుల్లంక ఉచిత ఇసుక క్వారీలో జేసీబీ సీజ్

మైనింగ్ శాఖాధికారుల తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్



సీజ్ చేసిన జేసీబీతో మైనింగ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది

కొల్లూరు: గాజుల్లంక ఇసుక క్వారీలో అక్రమ ఇసుక తవ్వకాలపై అధికారుల తనిఖీలు రెండో రోజైన గురువారం కొనసాగాయి. బుధవారం 'సాక్షి'లో 'పచ్చ దందా.. రేణువైనా మిగులుతుందా?' అనే శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే.. దీనిపై స్పందించిన రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి బుధవారమే క్వారీని పరిశీలించి ఇసుక లారీని సీజ్ చేశారు. రేపల్లె ఆర్డీఓ తనిఖీలతో అప్రమత్తమైన మైనింగ్ శాఖాధికారులు గురువారం మండలంలోని కృష్ణానదిలో గాజుల్లంక-2 క్వారీని తనిఖీ చేశారు. మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్ చేసిన తనిఖీలలో కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న జేసీబీ సీజ్ చేసి రెవెన్యూ, పోలీసు శాఖకు స్వాధీనం చేశారు. తనిఖీలలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: చిలకలూరిపేట మండలం కుక్కవారిపాలెం గ్రామం పంట పొలాల్లో పిడుగుపాటుకు గొర్రెలతో పాటు వాటిని కాసేందుకు వెళ్లిన రైతు మృత్యువాత పడిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పెదనందిపాడు మండలం ఉప్పలపాడు శివారు జరుగులవారిపాలెం గ్రామానికి చెందిన ఒంటిపులి అంకమ్మ(84) ఉదయాన్నే గొర్రెలను తీసుకొని కుక్కవారిపాలెం సమీపంలోని పంట పొలాలకు వెళ్లాడు. సాయంత్రం అకస్మాత్తుగా ఆకాశంలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. అంకమ్మ తన గొర్రెలను సమీపంలోని జమ్మిచెట్టు కిందకు నడిపించాడు. ఆ చెట్టుపై పిడుగు పడడంతో అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎయిడ్స్ నియంత్రణకు కళాజాతా బృందాల ప్రదర్శనలు

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయమ్మ



కళాజాతా బృందాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ

బాపట్ల: జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారి పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు కళాజాతా బృందాల ద్వారా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ తెలిపారు. గురువారం జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద కళాజాతా బృందాల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లోని మురికివాడల్లో, బస్టాండ్ కూడలి, మార్కెట్ ప్రాంతాల్లో జిల్లావ్యాప్తంగా 20 కళాజాతా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల25 వరకు కళాజాతా బృందాలు వీధినాటకాల ప్రదర్శన ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కళాజాతా బృందాల వీధి నాటికాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారన్నారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా ఎయిడ్స్, క్షయ వ్యాధిగ్రస్తులైన గర్భిణుల నుంచి శిశువుకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రత్నమన్మోహన్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ అధికారి షేక్ మొహమ్మద్ సాదిక్, జిల్లా దిశా క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాషా, కళాజాత బృందాలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక స్కూల్‌గా శ్రీరామా రూరల్ హైస్కూల్

- భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూల్స్ సొసైటీ అనుమతి
- విలేకరుల సమావేశంలో శ్రీరామా అకాడమీ అధ్యక్షుడు తులసీ విష్ణుప్రసాద్



తెనాలి: తెనాలి సమీపంలోని కొల్లూరు మండలం చిలుమూరులో గల శ్రీరామా రూరల్ హైస్కూలు ఇప్పుడు సైనిక్ స్కూలుగా రూపుదిద్దుకుంది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూల్స్ సొసైటీ నుంచి అనుమతులు లభించాయి. హైస్కూలు ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీరామా రూరల్ అకాడమీ అధ్యక్షుడు కొలసాని తులసీ విష్ణుప్రసాద్ వివరాలను వెల్లడించారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి సైనిక్ స్కూల్ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. భారతదేశంలో మొత్తం 33 సైనిక్ స్కూల్స్ పనిచేస్తుండగా, మన రాష్ట్రంలో కోరుకొండ, కలిగిరిలో నడుస్తున్నాయని గుర్తుచేశారు. వీటితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో తొలి దశలో 42 సైనిక్ స్కూల్స్‌కు, ఇప్పుడు మరో 33 సైనిక్ స్కూల్స్‌కు భారత రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూల్స్ సొసైటీ అనుమతినివ్వగా, అందులో గుంటూరు జిల్లా నుంచి 76 ఏళ్లుగా నడుస్తున్న శ్రీరామా రూరల్ హైస్కూలు ఒకటి కావటం గర్వకారణమన్నారు. కృష్ణానది ఒడ్డున దారీతెన్నూ లేని గ్రామీణ ప్రాంతంలో అప్పట్లో గురుకులంగా ఏర్పాటైన తమ పాఠశాల ఏటికేడాది ప్రగతి బాటన పయనిస్తూ ఈ స్థాయికి చేరిందన్నారు. అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ 1987లో కంప్యూటర్ లాబ్, 2020 నుంచి సీబీఎస్ఈ, అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో రోబోట్రిక్స్, డ్రోన్స్, త్రీడీ ప్రింటింగ్, స్క్రాచ్ కోడింగ్‌లో విద్యార్థులకు శిక్షణ నిస్తున్నామని గుర్తుచేశారు. ఈ ఏడాది నుంచి కృత్రిమ మేధలోనూ తరగతులు ఉంటాయన్నారు. మరోవైపు విద్యార్థులు పరిపూర్ణ వికాసానికి ఎన్‌సీసీ, క్రీడలకు తగిన ప్రాధాన్యతనిస్తూ జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. శ్రీరామా రూరల్ హైస్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ ఉత్తమ విద్యతోపాటు దేశానికి అవసరమైన భావిభారత పౌరులను తీర్చిదిద్దే దిశగా తమ సైనిక్‌స్కూల్ పనిచేస్తుందని చెప్పారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన బైకు

బల్లికురవ: వేగంగా వస్తున్న కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఇరువురు యువకులు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ ఘటన గురువారం నార్కెట్‌పల్లి-మేదరమెట్ల నామ్ రహదారిపై మండలంలోని వి. కొప్పరపాడు శివాలయం సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన అయ్యప్ప, వీరగంగయ్య పని నిమిత్తం బల్లికురవ మండలంలోని సూరేపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో తీవ్ర గాయాలపాలైన ఇరువురికి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానికులు కారును అదుపులోకి తీసుకున్నారు.

విద్వేష పూరిత వదంతులను వ్యాప్తిచేస్తే కఠిన చర్యలు

సోషల్ మీడియా, సైబర్ సెల్ విభాగాలను పరిశీలించిన ఎస్పీ

బాపట్లటౌన్: సామాజిక మాధ్యమాల్లో విద్వేష పూరిత వదంతులను వ్యాప్తిచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. గురువారం ఎస్పీ కార్యాలయం ఆవరణలోని సోషల్ మీడియా, సైబర్‌సెల్, డీపీవో కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సోషల్ మీడియా మాధ్యమాలపై సైబర్ సెల్, సోషల్ మీడియా పోలీసులతో నిరంతర నిఘా ఉంచామన్నారు. సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వదంతులు వ్యాపింపచేసినా, ఆడియో, వీడియోల రూపంలో సందేశాలను పోస్ట్ చేసినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఏదైనా మెసేజ్ ఫార్వర్డ్ చేసేముందు అది వాస్తవమైనదా కాదా అని నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే పోస్ట్ చేయాలన్నారు. ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్ట్ చేస్తే సంబంధిత గ్రూప్ అడ్మిన్, నిర్వాహకులు వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. లేకుంటే గ్రూప్ అడ్మిన్లు, నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ జయకుమార్, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.